క్లుప్తంగా

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు

మల్దకల్: ఫర్టిలైజర్ షాపు యజమానులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ ఫర్టిలైజర్ నిర్వాహకులను హెచ్చరించారు. మంగళవారం ఫర్టిలైజర్ షాపులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు, రైతులకు ఎరువులను విక్రయించిన వెంటనే రశీదులను ఇవ్వాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా షాపు యజమానులతో రశీదులు పొందాలన్నారు. అంతకు ముందు ఆయన మల్దకల్‌లో కంది పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. కేంద్రాల్లో ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణీ, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయండి



గద్వాల అర్బన్: ఈనెల 22న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరగబోయే కల్లుగీత కార్మికుల మహాధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు రామచంద్రయ్యగౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గీత కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీవీ నర్సింహ, సీతారాములు, అయ్యప్ప, సరోజమ్మ ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



గద్వాల అర్బన్: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబానికి సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం చేయూతనందించింది. పట్టణానికి చెందిన సాయిబాబ ప్రైవేట్ డ్రాయింగ్ టీచర్‌గా పని చేస్తుండగా, ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇంట్లో ఉండడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సోమవారం సాయిబాబకు ఆరు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ.1000 నగదు అందజేశారు. కార్యక్రమంలో సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు శ్రీకాంత్, నాగరాజు, మురళీ, అశోక్, గోపాల్ ఉన్నారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం కొబ్బరికాయలు కొట్టి శివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు.

నేటి నుంచి ఫకీర్‌వలి దర్గా ఉత్సవాలు



అయిజ: మండల కేంద్రంలో, పర్దీపురం సమీపంలోని హజరత్ ఖరాజా సయ్యద్ బాబా ఫకీర్ వలి దర్గా ఉత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు. బుధవారం గంధం, గురువారం ఉర్సు, శుక్రవారం ఫాతెహా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు తరలివస్తారని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు.



సంకాపురంలో పూజలు చేస్తున్న భక్తులు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తనయులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

కొలువుదీరిన గణనాథులు

● భక్తి శ్రద్ధలతో పూజలు

గద్వాల: వినాయక చవితి పండగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో సోమవారం వినాయక విగ్రహాలు ప్రతిష్టించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి విగ్రహాలకు పైగా ప్రతిమలను ప్రతిష్టించారు. అయిజ, అలంపూర్, శాంతినగర్‌లో సైతం జిల్లా కేంద్రానికి దీటుగా గణేష్ మండపాలను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ఆకార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతికి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత పూజలు చేశారు. గణేశ్ మండపాలలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పట్టణంలోని పలు మండపాలలో పూజలు నిర్వహించారు. పలు మండపాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకుంటున్న చంద్రయాన్–3

గద్వాల జిల్లా కేంద్రంలోని పాండురంగస్వామి ఆలయంలో స్వకులశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చంద్రయాన్–3 నమూనా గణనాథుడు విశేషంగా ఆకట్టుకుంటున్నాడు.

కేటీదొడ్డి: మండలంలోని కేటీదొడ్డి, చింతలకుంట, పాగుంట గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి పూజలో ఎమ్మెల్యే తనయుడు బండ్ల సాకేత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులకు ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిమ్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, యువకులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో గణేశుడికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

అయిజ: మండల కేంద్రంలో, మండలంలోని వివిధ గ్రామాల్లో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసి సోమ, మంగళవారం పూజలు చేశారు.

రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. తమ పనులు నిర్విఘ్నంగా సాగాలని భక్తులు మొక్కుకున్నారు.

గట్టు: బల్గెర, గట్టు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతునాయుడులు సందర్శించి, పూజల్లో పాల్గొన్నారు.

ఎరవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, పార్టీల నాయకులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకుని దర్శించుకోని యువత, మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.కొన్ని చోట్ల అన్నదానం ఏర్పాటు చేశారు.

శాంతినగర్: వడ్డేపల్లి పట్టణం, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గణేశ్‌కు నాయకులు పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న పేపర్ వినాయకుడు

ఎరవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి సరస్వతి పాఠశాలలో పేపర్‌తో చేసిన వినాయకుడు ఆకట్టుకున్నాడు. పాఠశాల డ్రాయింగ్ టీచర్ పార్థసారథి విద్యార్థుల సహకారంతో ఏ ర్పాటు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పేప ర్ వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. మట్టి, పేపర్‌తో చేసిన వినాయకుడిని నిమజ్జనం వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని కలగదని తెలిపారు.

మానవపాడు: మండలంలోని మండపాలు ప్రత్యేక అలంకరణతో ముస్తాబు చేసి భక్తిశ్రద్ధలతో వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు.



కొండేరులో పూజలు చేస్తున్న నాయకులు



కొంకలలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



శేషంపల్లిలో పూజలందుకుంటున్న గణనాథుడు



అయిజలో..



గట్టులో..



పుల్లూరులో భక్తులకు అన్నదానం

ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడాలి

● సీఐ రాజు

అలంపూర్ రూరల్: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం ఉండాలని సీఐ రాజు అన్నారు. అలంపూర్ పట్టణం పోలీస్ స్టేషన్‌లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులతో మంగళవారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ రాజు, ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ విగ్రహాల దగ్గర రోజు ఒక సేవ కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విగ్రహాల దగ్గర భక్తి భావం కలిగి ఉండాలని సౌండ్ బాక్స్‌ల వల్ల ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా చూసుకోవాలన్నారు. డయాల్ 100పై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు రజినీబాబు, బాలరాజు, నాగరాజు పాల్గొన్నారు.



అలంపూర్ పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న సీఐ రాజు

పార్టీ బలోపేతానికి పాటుపడాలి

● కాంగ్రెస్‌పార్టీ పార్లమెంట్ అబ్జర్వర్ పీవీ మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న పీవీ మోహన్

శాంతినగర్: అలంపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అబ్జర్వర్ పీవీ మోహన్ అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ కార్యదర్శి పీవీ మోహన్ మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో అలంపూర్ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మాట్లాడారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీ అన్నారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొంకల నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వెంకటేష్, కొండా ప్రశాంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష



నిరాహార దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు



మానవపాడులో రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు.

కేటీదొడ్డి: ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు డీకే సుందర్‌రాజ్, జిల్లా కో–కన్వీనర్ బండారి డేవిడ్ డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదిగ, ఉప కులాల ప్రజలంతా ప్రధాన మంత్రి చేసే ప్రకటన కోసం ఆశతో ఎదురు చూస్తామని, ఎస్సీ వర్గీకరణ మీద ప్రకటన చేయకపోతే బీజేపీకి రాజకీయంగా దూరం అవుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జాంబయ్య, నాయకులు పాల్గొన్నారు.

మానవపాడు: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్ట బద్ధత కల్పించాలని జిల్లా సమన్వయ కర్త మస్తాన్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం, మంగళవారాలు మండలకేంద్రంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జయరాజ్, శ్రీను, బీచుపల్లి, రాముడు, నాయకులు పాల్గొన్నారు.

గట్టు: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం దగ్గర నిరసన దీక్షను కొనసాగించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ముక్కెరన్న, చాగదోన వీరేష్, మిట్టదొడ్డి సర్పంచు నర్సింహులు, ఇందువాసి భాస్కర్, నర్సింహులు, శాంతప్ప, తిమ్మప్ప, రామునాయుడు, బల్గెర ప్రతాప్, నాగరాజు, బాబు, రాజు పాల్గొన్నారు.

సంతకాలు ఫోర్జరీ చేసి కేసు పెట్టారు

ధరూరు: తన సంతకాలు ఫోర్జరీ చేసి అన్యాయంగా కేసు పెట్టారని మండలంలోని గార్లపాడుకు చెందిన శివరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వివరాల ప్రకారం.. జూరాల రిజర్వాయర్‌లో ముంపు గ్రామమైన గార్లపాడుకు 2012లో అవార్డు పాసై పరిహారం అందించారు. అదనపు పరిహారం కోసం ప్రత్యేకంగా న్యాయవాదిని నియమించుకున్నారు. సదరు న్యాయవాది తనపై కుట్రపూరితంగా సంతకాన్ని ఫోర్జరీ చేసి రూ.25లక్షలకు ప్రాంసరి రాసుకున్నారని పేర్కొన్నారు. అన్యాయంగా తనపై కేసు వేసిన న్యాయవాది నారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయంలో చోరీ

అయిజ: పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు ఆలయానికి వేసిన తాళాలను పగులగొట్టి లోపలికి వెళ్లారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, దానికి సంబంధించిన సెట్టును చోరీ చేశారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఆలయానికి చేరుకోగా, తాళాలు పగులగొట్టినట్లు గమనించారు. శనివారం రాత్రి కూడా దుండగులు ఆలయానికి వేసిన తాళాలు పగులగొట్టి వెళ్లారని, ఇది రెండోసారి అని ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంట్లో చోరీ: కేసు నమోదు

శాంతినగర్: విదేశాలకు వెళ్లిన వారి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్‌లో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన గోగినేని గంగాధర్ కుటుంబం ఇటీవల లండన్‌కు వెళ్లారు. ఇంటి బాగోగులను చూసుకోమని బంధువులైన తలశిల కల్యాణికి బాధ్యతలు అప్పగించారు. రోజు ఇంటికి వెళ్లి సాయంత్రం వేళలో లైట్లు వేసి వచ్చేది. సోమవారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో లైట్లు వేయడానికి వెళ్లగా అప్పటికే లైట్లు వెలగడం, ఇంటి తలుపులు, బీరువా తలుపులు తెరిచి ఉండటం గమనించింది. వెంటనే యజమాని గంగాధర్‌కు చోరీ జరిగిన విషయం ఫోన్ ద్వారా చేరవేసింది. గంగాధర్ బావమర్ది వచ్చి ఇంట్లో వెతగ్గా బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు, వస్తువులు కనిపించలేదు. ఈ విషయమై తలశిల కల్యాణి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పార్టీ బలోపేతానికి యువతదే కీలకపాత్ర

గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువత కీలక పాత్ర పోషించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత క్యాంపు కార్యాయలంలో గంటవీధి, కాకులావరం గ్రామానికి చెందిన వివిధ పార్టీల వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి జెడ్పీ చైర్ పర్సన్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, వెంకటన్న, సుధాకర్ ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

శాంతినగర్: జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా బి.నరసింహ బాధ్యతలు చేపట్టడంతో ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. గతంలో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల శాంతినగర్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన నరసింహ రామాపురానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ప్రధానోపాధ్యాయులు హరుణ్‌రషీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతల స్వీకరణ

మానవపాడు: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయులుగా శివప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా ఉండి బదిలీపై మానవపాడు వచ్చారు. మండలకేంద్రంలో ఎంఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

‘సమగ్ర శిక్ష’ ఉద్యోగులకు భద్రత కల్పించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

గద్వాల: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు భద్రత కల్పించి తక్షణమే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన రిలే దీక్ష 18వ రోజుకు చేరింది. దీక్ష శిబిరంలో ఉద్యోగులు ప్లకార్డులు చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం గణనాథునికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేసి నిరసన తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా జేఏసీ నాయకులు హుసేనప్ప, గోపాల్ మాట్లాడారు. కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్‌ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల డిమాండ్లు నెరవేర్చాలి

గద్వాల అర్బన్: అంగన్‌వాడీ టీచర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్‌లో చేపట్టిన సమ్మె సోమవారం ఎనిమిదో రోజుకు చేరింది. సమ్మెకు దళిత సమైక్య జిల్లా అధ్యక్షుడు మోహన్, రిటైర్డ్ ఎంఈఓ స్వామి వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఎనిమిది రోజులుగా అంగన్‌వాడీ టీచర్లు సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీలకు కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమ్మెలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ, అరుంజ్యోతి, సలోమి, ఫరీదా, లక్ష్మీకాంతమ్మ ఉన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ ఎంఈఓ స్వామి

భగీరథ మహర్షి విగ్రహం ఏర్పాటు చేయాలి



సర్పంచ్‌కు వినతి పత్రం అందిస్తున్న సగర సంఘం నాయకులు

గట్టు: మండల కేంద్రంలో భగీరథ మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సగర సంఘం నాయకులు మంగళవారం సర్పంచ్ ధనలక్ష్మిని కలిసి స్థలం కేటాయించాలని కోరారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు రమేష్, వెంకటేష్, జిల్లా కోశాధికారి రవి, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, రిటైర్డ్ హెడ్మాస్టర్ గోవిందప్ప, గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీను, మహాదేవ్, సగర సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని విజయ్‌కుమార్ పక్షవాతంతో కదలేని స్థితిలో ఉండడంతో తోటి స్నేహితులు 1995–96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అతనికి రూ.15,201 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంజీ బాలస్వామి, నారాయణ గౌడు, ప్రభాకర్, గోపాల్, సుధాకర్, స్వాములు, మల్లికార్జున ఉన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

మహిళా బిల్లు ప్రవేశ పెట్టడంతో సంబురాలు



మిఠాయిలు తినిపించుకుంటున్న మహిళలు

గద్వాల: పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తూ బీజేపీ మహిళా మోర్చా నాయకులు సంబురాలు నిర్వహించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంపిణీ చేశారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాల కృష్ణవేణి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోదీకి మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు కృష్ణవేణి, జయశ్రీ, అనిత, భారతి, నర్సమ్మ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఢీకొట్టిన వాహనం

మానవపాడు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. విగ్రహాన్ని ఢీకొట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు జగ్గుల అశన్న, శివరాముడు, కరెంట్ రవి, పోతుగంటి నరేష్, నాగరాజు, మహేష్, సరేందర్ డిమాండ్ చేశారు.



రేపు సర్వసభ్య సమావేశం

శాంతినగర్: వడ్డేపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రజిత అధ్యక్షతన గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవీంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల మహిళా సమాఖ్య భవనంలో ఉదయం 11గంటలకు సమావేశం ఉంటుందని, ఆయా శాఖల అధికారులు వారి శాఖకు సంబంధించిన నివేదికలతో హాజరుకావాలని సూచించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులు సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

పశువైద్య కేంద్రానికి వైద్యుడిని నియమించాలి

మల్దకల్: మండలంలోని పాల్వాయిలో ఉన్న పశువైద్య కేంద్రానికి వైద్యుడిని నియమించాలని రైతులు కోరుతున్నారు. రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పశువైద్య కేంద్రం పశువైద్యాధికారి లేకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. పశువులు, గొర్రెలకు వచ్చే వ్యాధులతో మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పాల్వాయి పశువైద్య కేంద్రానికి డాక్టర్‌ను నియమించాలని గ్రామస్తులు, రైతులు కోరారు.